ప్రజాశక్తి

మంగళవారం 31 జనవరి 2023 5

శ్రీ సత్యసాయి



జగనన్న చేదోడు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

వీధికొక రథసారథి..!

◆ ఎన్నికలకు వైసిపి పక్కా ప్రణాళిక ◆ వాలంటీర్లకు తోడుగా గృహరథసారధులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార వైసిపి అప్పుడే ఎన్నికలకు సర్వం సిద్ధమవుతోంది. గతేడాది నుంచే గడపగడపకూ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. అది ఇంక కొనసాగుతూ ఉంది. అయితే ఈ కార్యక్రమం అంతగా ఫలితాలిస్తున్నట్టు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మరింత లోతుగా ప్రజలకు చేరవయ్యేందుకు సన్నద్ధమైంది. పట్టణాల్లో వంద కుటుంబాలకు ఒక వాలంటీరు, గ్రామాల్లో 50 ఇళ్లకు ఒకరు చొప్పున ఉన్నారు. వీరి ద్వారా సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో వాలంటీర్లను పక్కనబెడితే ఏమవుతుందో గుబులో ఏమోగాని వారి కింద మరికొంత మందిని నియమించే ప్రక్రియను అధికార వైసిపి చేపడుతోంది. అది వాలంటీర్ల ద్వారానే చేపడుతోంది. ప్రతి వీధికి ఒక గృహ రథసారధి పేరుతో నియామకాలను చేపడుతున్నారు. ఇప్పటికే వార్డుకు ఒక కన్వీనర్‌ను నియమించారు. ఇది కాకుండా తాజాగా వీధికొక గృహ రథసారధిని నియమిస్తున్నారు. వాలంటీర్లకు ఎన్నికల సంఘం వీధుల్లోకి తీసుకోకుండా ఇతర వాటికి వినియోగిస్తే గృహ రథసారధుల ద్వారా ప్రజలకు చేరవయ్యేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఈ రథసారధులు ఎన్నికల వరకు ప్రతి ఇంటికెళ్లి ఆయా కుటుంబానికి జరిగిన మేలు గురించి వివరించాల్సి ఉంటుంది. వారి ద్వారానే ఎన్నికల్లోనూ ఓటర్లను ప్రభావితం చేసే ఆలోచనలోనున్నట్టు తెలుస్తోంది. ఈ రకంగా ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో వేలాది మంది గృహ రథసారదులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రథసారధులను వాలంటీర్ల ద్వారానే గుర్తించి వారి ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫోజులు సైతం సేకరిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికలకు సన్నద్ధమయ్యే పనులను చేపడుతోంది.



ఎన్నికల కోసమేనా ?

ఈ రకంగా పెద్దఎత్తున చేపడుతున్న నియామకాలు వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునేనా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వార్డు కన్వీనర్లు, వాలంటీర్లు కాక, మరింత మందిని గృహ రథసారధులు చేపడుతుండటం ఎన్నికల్లో సులభంగా ప్రతి ఓటరును ప్రభావితం చేయడానికేనా అన్నది చర్చ సాగుతోంది. ఇది పూర్తయితే ఎన్నికలకు ఇంత పెద్ద యంత్రాంగం మరే ఇతర పార్టీ వద్ద ఉండే అవకాశం లేదు. సూక్ష్మస్థాయి ప్రతి ఓటరు మొదలుకుని ప్రభావితం చేసేందుకు వీలుగా అధికారపార్టీ కసరత్తు ప్రారంభించిందనే చెప్పాలి. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల మనుషుల్లో స్థానముందని చెప్పుకునే వైసిపి ఈ రకమైన ప్రణాళికతో ముందుకుపోవడం ఏమిటన్నది కూడా రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఉద్యోగుల్లో కాస్త వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు కాకుండా ఇతర సామాజిక తరగతులు, ఇతర వర్గాలకు తమ వైపు బలంగా తిప్పుకోవడంతోపాటు, తమక అనుకూలమైన వారితో ఓటింగ్ చేయించుకునేందుకు వీలుగా అధికార వైసిపి ఈ రకమైన ఎత్తులు వేస్తున్నట్టు విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ఇవన్నీ ఏ రకమైన ఫలితాలను అధికారపార్టీకి తెచ్చిపెడతాయన్నది చూడాల్సి ఉంది.

10,781 మందికి జగనన్నచేదోడు

◆ రూ.10.78 కోట్ల లబ్ధి ◆ కలెక్టర్ పి.బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

3వ విడత జగన్న చేదోడు కార్యక్రమం ద్వారా జిల్లాలో 10,781 మందికి రూ.10.78 కోట్ల లబ్ధి చేకూరిందని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో జగన్న చేదోడు పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, పూడా ఛైర్మన్ లక్ష్మీ నరసమ్మ, బీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి, షాపులున్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలరింగ్ వత్తి చేసే వారికి ప్రభుత్వం సంవత్సరానికి రూ.10 వేల రూపాయలు అందిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో అర్హులైన 10,781 మంది షాపులున్న రజకులు, నాయి బ్రాహ్మణులు, టైలర్లకు రూ.10.78 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అర్హులు ఎవరైనా ఇంకా మిగిలిపోయి ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం అర్హులైన వారికి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం రూ.10.78 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, బిసి కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ముఖహాజరు తప్పనిసరి

◆ స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

◆ కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ముఖ హాజరును తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 166 వినతులను స్వీకరించారు. అనంతరం డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖతో కలిసి స్పందన అర్జీలు, గడపగడపకూ మన ప్రభుత్వం, సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్, ఆయుష్మాన్ భారత్ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉద్యోగికీ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేసిందని, ఉద్యోగులందరూ ఎపిఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తప్పకుండా ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. స్పందన అర్జీలు బియాండ్ ఎస్-ఎల్ఎ లోకి వెళ్లకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పకుండా వంద శాతం వేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, పిఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిసిహెచ్ఒ తిపేంద్రనాయక్, చేనేత జౌళి శాఖ ఎడి రమేష్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఇన్‌ఛార్జి డిఈఒ మీనాక్షి, ఆరోగ్యశ్రీ అధికారి యల్లప్పతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

కనగానపల్లి : మండలంలోని ప్రభుత్వ, దేవాదాయ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి భూమిలేని నిరు పేదలకు పంపిణీలో పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, మండల కార్యదర్శి బత్తల కదిరప్ప మాట్లాడుతూ మండలంలోని భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ప్రభుత్వ, దేవాదాయ, ఆటవీ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి పేదలకు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు పంపినీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు కూలీలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై దృష్టి సారించాలి

బత్తలపల్లి : ప్రతి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంతోపాటు అన్ని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ప్రతి అధికారి తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సాయిమనోహర్, ఎపిఎం సుదర్శన్ రాజు, ఎఒ ఓటి.రెడ్డి, మండల ఇంజినీర్ రమణయ్య, పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వరలక్ష్మీ, ట్రాన్స్‌కో ఎఇ శివయ్య, హౌసింగ్ ఎఇ రాజశేఖర్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు సకాలంలో జీతభత్యాలు చెల్లించాలి

బత్తలపల్లి : పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతభత్యాలు చెల్లించాలని రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు బోయ సాంబశివ, సిపిఐ మండల నాయకులు గోగుల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జీతభత్యాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే చనిపోయిన కార్మికునికి ఆర్థికసాయం అందజేయాలన్నారు. అనంతరం మండలంలోని వివిధ పంచాయతీల నుంచి వచ్చిన కార్మికులతో కలిసి ఎంపిడిఒ సాయిమనోహరకు వినతిపత్రం అందజేశారు.

రేపటి నుంచి వైఎస్ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి : ప్రతినెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక పింఛన్ల సొమ్మును బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ సాయిమనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 6,267 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నట్లు తెలిపారు. వీటికి రూ.1.73.91.250 విడుదలైనట్లు తెలిపారు. వీటిని ఆయా గ్రామాలకు సంబంధించిన కార్యదర్శులు, విఆర్డీఓలు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు బ్యాంకుల్లో డబ్బులను మంగళవారం డ్రా చేయనున్నట్లు తెలిపారు.

ఆదాయానికి మించి అంచనాలు

◆ ప్రారంభ నిల్వ రూ.55 కోట్లు.. జమ రూ.120 కోట్లు ◆ మొత్తం రూ.175 కోట్లతో నేడు మున్సిపల్ బడ్జెట్

ప్రజాశక్తి-హిందూపురం

ఆదాయం మూరెడు....ఆశ బారెడు....అన్న చందంగా హిందూపురం పురపాలక సంఘం తయారైంది. హిందూపురం మున్సిపల్ వాస్తవ ఆదాయం ఏడాదికి రూ.30 కోట్ల వరకు ఉంటుంది. మరింత పన్నుల పెంపుతో పాటు చెత్త పన్ను భారీగా వసూలు చేసి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అది రూ.55 కోట్లకు పెంచాలని పాలకులు నిర్ణయించారు. వచ్చిన ఆదాయం అంతా గత పాలకులు చేసిన అప్పులకు చెల్లించాల్సిన వడ్డీలకు, విద్యుత్ బిల్లులు, పారిశుధ్య వాహనాల నిర్వహణ, పారిశుధ్యం, ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులతో వేతనాలకే సరిపోవడం లేదు. ప్రారంభ నిల్వ రూ.55.13 కోట్లు, సాధారణ జమలు 46.07 కోట్లతో కలిపి 2023-24లో అన్ని పద్దులూ రూ.119,34,95,500 ఆదాయంతో మొత్తం రూ.174,48,41,675తో హిందూపురం పురపాలక సంఘ బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. దీనిపై మంగళవారం హిందూపురం పురపాలక సంఘ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ అధ్యక్షతన రెండు సమావేశాలు జరుగుతున్నాయి. మొదట ప్రత్యేక సమావేశం నిర్వహించి బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. అనంతరం సాధరణ సమావేశం నిర్వహించి, ఇందులో 30 అంశాలతో కూడిన అజెండాను అధికారులు ప్రవేశ పెట్టనున్నారు. వచ్చిన ఆదాయంలో మున్సిపాల్టీ పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలు, విద్యుత్ ఛార్జీల చెల్లింపు, నీటి సరఫరా విభాగం అప్పులు, వడ్డీల చెల్లింపుకే రూ.30 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. మున్సిపల్ పాలన, నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణకు రూ.10 కోట్లు పైగా అవసరం. మరో వైపు మున్సిపాల్టీకి ప్రభుత్వం నుంచి కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా ఏ రకంగాను ఒక్క రూపాయి నిధులు కూడా ఏ పథకం అమలుకు గానీ నాలుగేళ్లుగా డబ్బులు రావడం లేదు. దీంతో జనంపై భారీగా భారం మోపడానికి పాలకులు సిద్ధం అయ్యారు. వచ్చిన ఆదాయం ఖర్చులకు సరిపోతున్నా, ప్రభుత్వం నుంచి గ్రాంట్లు రాకున్నా, మరో నెల రోజుల్లో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.55 కోట్లు మున్సిపాల్టీ వద్ద ఉన్నట్లు, వాటికి మున్సిపాల్టీ సొంత ఆదాయం రూ.55 కోట్లు ప్రభుత్వం ఇచ్చే మూలధన గ్రాంట్లు మొత్తంగా రూ. రూ.65 కోట్లను కలిపితే మొత్తం బడ్జెట్

రూ.175 కోట్లు అవుతుందని అధికారులు ప్రకటించారు. ఇందులో ఈ ఏడాది వ్యయం రూ. 118 కోట్లు చేస్తున్నట్లు, రూ.57 కోట్లు మిగులుతున్నట్లు పేర్కొన్నారు. అయితే ఎక్కడ మిగులు ఉందో అర్థం కాక తలపట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. అంకెల గారడీతో పెద్ద బడ్జెట్‌ను రూపొందించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ వాస్తవ ఆదాయం రూ.30 కోట్లుగా పేర్కొన్న అధికారులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.55 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ఖర్చు సైతం అదే స్థాయిలో ఉంటుందని రూ.40 కోట్లు, వ్యయాన్ని అంచనా వేశారు. మిగిలిన రూ.15 కోట్లు అభివద్ధి పనులకు వెచ్చిస్తున్నట్లు ప్రకటించారు. మూలధన జమలు కింద 15వ ఆర్థిక సంఘం నిధులు మాత్రమే వస్తుండటంతో బడ్జెట్ భారీగా కనిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల సొమ్ము రూ.50 కోట్లను మున్సిపల్ మూలధన ఖాతాలో చూపడం చూస్తుంటే మున్సిపల్ బడ్జెట్ అంకెల గారెడి తరహాలో ఉంది నిపుణులు పేర్కొంటున్నారు.

హోమం నిర్వహిస్తున్న పద్మశాలీయ బహుత్తమ సంఘం సభ్యులు, మహిళలు

ఘనంగా భద్రావతి భావనా ఋషీంద్రుల ఉత్సవాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో వెలసిన భద్రావతి భావనా ఋషీంద్రుల 57వ కళ్యాణ మహోత్స వాలు సోమవారం కనుల పండువగా ప్రారంభ మయ్యాయి. ఇందులో భాగంగా పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయం నుంచి మార్కెట్ వీధిలోనిమార్కెండేయస్వామి ఆలయం వరకు స్వాముల పట్టువస్త్రాలను మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉదయం 6గంటలకు గోపూజ, మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచ గవ్య ప్రాశన, ఋత్విగరణం, కార్యకర్తలకు కంక ణధారణ, ఆదిత్యాది నవగ్రహ సహిత కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, సాయందీక్షా హోమం, మహాగణపతి హోమం, అనంతరం మహా మంగళహారతి నిర్వహించారు. తర్వాత వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భద్రావతి భావనా ఋషీంద్రులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు బిందెసేవ (గంగ పూజ)తోపాటు పంచామృతాభిషేకం, అంకురార్పణ, షోడషోపచార, అష్టోత్తరం, లక్ష్మీనారాయణ హోమం చేపట్టారు. సాయంత్రం ధ్వజారోహణం నిర్వహించారు. నేడు ఉదయం స్వాములవారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షులు జింకా రామంజినేయులు, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, కోశాధికారి పొరాళ్ల పుల్లయ్య తెలిపారు. కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి-బత్తలపల్లి

కులవృత్తుల వారికి రూ.10వేలు వేయడాన్ని హర్షిస్తూ ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లతోపాటు పలువురికి జగనన్న చేదోడు పథకం కింద రూ.10వేలను నేరుగా లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి పథకాలు చేపట్టలేదన్నారు. మూడేళ్లుగా ఒక్కో లబ్ధిదారుడు రూ.30వేలు వరకు ఆర్థికసాయం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆక్కిం దామోదర్, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, నాయకులు జిక్రీయా, నాగభూషణ, రియాజ్‌తోపాటు పలువురు లబ్ధిదారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, తదితరులు

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సాగుదారులకు న్యాయం చేయండి

వ్యకాసం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-పెనుకొండ

ఇంటి పట్టాదారులు, సాగుభూమి దారులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో రొద్దం, సోమందేపల్లి, పెనుకొండ మండలాలకు చెందిన ప్రభుత్వ వ్యవసాయ భూమి సాగుదారులు , సోమందేపల్లి నక్కలగుట్ట ఇండ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు. మునిమడుగు దళితుల శ్మశాన భూమి ఆక్రమణను కాపాడాలని దళితుల కోసం శ్మశాన స్థలం కేటాయించాలని కొండాపురం గ్రామ దళితులు కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నక్కల గుట్టలో ఇంటి నిర్మాణాలకు అనుమతించాలని, హైకోర్టు ఉత్తర్వులు అమలుపరచాలని, దళితుల శ్మశాన భూమి ఆక్రమణ ఆపాలని డిమాండ్ చేశారు. పేదల పట్ల ఆయా మండల తహశీల్దార్ల మోసపూరిత వైఖరి నశించాలని నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటలసేపు ఆందోళన కొనసాగినా సబ్ కలెక్టర్ స్పందించకపోవడంతో సహనం కోల్పోయిన బాధితులు సబ్ కలెక్టర్ చాంబర్లోకి చొచ్చుకొని పోయే ప్రయత్నం చేశారు. అయితే అక్కడే వున్న సిఐ, ఎస్‌లు వారించారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ బాలస్వామి , వెంకటరాముడు, కెవిపిఎస్ హనుమయ్య, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశులు, రంగప్ప, తిప్పన్న, సోమందేపల్లి సిఐటియు నాయకులు కొండా వెంకటేశులు , నాగభూషణ, మాబు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో కుష్టువ్యాధి నివారణ

బత్తలపల్లి : కుష్టువ్యాధిపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి తేజశ్రీ సూచించారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పర్శ, కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలైన స్పర్శలేని మచ్చలు, కనురెప్పలు మూతపడకపోవడం, చేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లు, చేతులకు తిమ్మిర్లు కలిగి ఉండడంలాంటి లక్షణాలను గుర్తించి, అలాంటి వారిని కుష్టువ్యాధిగ్రస్తులుగా అనుమానించి వ్యాధి నిర్ధారణ కోసం ఆరోగ్య కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, గౌరమ్మ, నారమ్మ, స్టాఫ్ నర్సులు సుకన్య, మంజుల, సరస్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణాచార్య ట్రస్టు సేవలు అభినందనీయం

ధర్మవరం టౌన్ : పరమపిత వెంకటరమణాచార్య గురువు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్ తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక సిద్ధయ్యగుట్టలోని శ్రీపరమపిత వెంకటరమణాచార్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిఎం మాట్లాడుతూ పేదలకు సేవచేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ లేదన్నారు. మనిషికి తోటిమనిషి సాయపడే గుణాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు యోగిముక్తేశ్వరిమాతాజీ, మోక్షిముక్తేశ్వరి మాతాజీ, వైస్‌ఛైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి రామాంజనేయచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి నాగభూషణం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆలయ అభివృద్ధికి విరాళం

నంబులపూలకుంట : మండలపరిధిలోని గౌకనపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయ అభివృద్ధికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ రూ. 50వేలు విరాళం అందించినట్లు మాజీ సర్పంచి రామ గంగిరెడ్డి తెలిపారు. ఈ నెల 10న గౌకనపల్లిలో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవానికి కందికుంటని ఆహ్వానించగా స్పందించిన ఆయన 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టే మహేశ్వర రెడ్డి, రాజారెడ్డి, జల్లా మహేశ్వర రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలను పట్టించుకోని ప్రభుత్వం

గోరంట్ల : రాష్ట్రంలో పేదలను వైసిపి ప్రభుత్వం పట్టించుకోవటం లేదని టిడిపి స్థానిక నాయకులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో మూడవ బ్లాక్‌లో నిర్వహించిన ఇదేమి ఖర్మ ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు వేణు రాయల్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాం, ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, నాయకులు శ్రీనివాసులు, రామచంద్ర, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

మడకశిర రూరల్ : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ భాస్కర్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఎంపీపీ ఎస్ పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్, స్కూల్ కమిటీ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

లేపాక్షి : మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పెంచినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విగ్రహ ప్రతిష్టాపన

మడకశిర : మండలంలోని చందకచర్ల గ్రామంలో గంగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన సోమవారం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజల అనంతరం సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిత ఆంజనేయులు, రాధాకృష్ణ, చంద్రప్ప , లక్ష్మీనారాయణ , దాసిరెడ్డి , తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా అర్హత గల వారు జగనన్న గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ జయ చంద్రారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏడు సచివాలయ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరూ జగనన్న గృహాలు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆధార్, రేషన్ కార్డు. స్థల ధ్రువీకరణ పత్రంతో కూడిన దరఖాస్తును స్థానిక సచివాలయ పరిధిలోని ఒకటవ తేదీ లోపల అందజేయాలని ఆయన కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ తెలిపారు. 2023-2024 బడ్జెట్‌తో పాటు 30 అంశాలతో కూడిన అజెండాపై ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు చెప్పారు. వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

హనుమంత వాహనంపై శ్రీవారు

కదిరి టౌన్ : మధ్వనవమి ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీశుడు ప్రత్యేక పుష్పాలంకరణతో హనుమంత వాహనంపై సోమవారం దర్శనమిచ్చారు. తిరుమాడ విధుల లో ఉత్సవ విగ్రహాన్ని ఈసందర్భంగా ఊరేగించారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని కొత్త నిడిమామిడి గ్రామంలో సోమవారం కుష్టువ్యాధి నివారణపై వైద్యసిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్పర్శ కార్యక్రమం లో భాగంగా గ్రామంలో పర్యటించిన వైద్యసిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నాగరాజు, 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళి , హెల్త్ సూపర్‌వైజర్ రమణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో కుష్టువ్యాధి నివారణపై వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వైద్యసిబ్బంది కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, పిహెచ్ఎన్ భారతి, సూపర్వైజర్ సుధాకర్, ఎఎన్ఎం లలితమ్మ, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ రెడ్డి, ఆశా కార్యకర్తలు స్వర్ణలత, ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహామూర్తి ఆధ్వర్యంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర, నారాయణమ్మ, సిహెచ్ఒ శిరీష, వార్డు మెంబర్లు గంగాద్రి, బాబు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ వర్ధంతి

తలుపుల : మండల కేంద్రంలోనిమూడు రోడ్ల కూడలిలో మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, షాకీర్, గోరా బాబు, మస్తాన్, రామచంద్ర, వెంకటరమణ, టోపీ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను చిరస్మరణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వెంకటకృష్ణయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వర ప్రసాద్, చంద్రమోహన్, దస్తగిరి, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మహాత్మా గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ హరిత, నాయకులు శ్యామ్ కిరణ్, కలీం, షాహిద్, ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్, కిసాన్ సెల్ తిమ్మారెడ్డి, హనుమంతరాయప్ప, అన్వర్, బాబు, జియ తదితరులు పాల్గొన్నారు.

'జిఎంఎస్ గ్యాలరీ ఫిలిం' చిత్రాలకు అవార్డులు

గోరంట్ల : జిఎంఎస్ గ్యాలరీ ఫిలిం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చిత్రాలకు ఐదు అవార్డులు వచ్చినట్లు నిర్మాత జిఎం సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన టార్చ్ బేరర్, పెళ్లిచూపులు చిత్రాలకు ఐదు అవార్డులు వచ్చినట్లు తెలిపారు. ఈ చిత్రాలకు అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు చిత్రాలలో నటించిన సాంకేతిక నిపుణులకు, నటీనటులకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

నష్టాలబాటలో టమోటా రైతులు

పశువులకు వదిలేసిన టమోటా తోట

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఈ ఏడాది టమోటా రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చింది ఈ ఏడాదిలో ఏదో ఒక సందర్భంలో టమోటా పంట రైతులకు అరకొర లాభాలు తెచ్చిపెట్టేవి. అయితే ఈ ఏడాది మొత్తం రైతులకు తీరని నష్టం చేకూర్చింది. మొదటి కోత కొంతవరకు దిగుబడి ఎక్కువగా వచ్చినా మార్కెట్లోకి వచ్చేసరికి ధర లేక పెట్టుబడులు సైతం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని టమోటా రైతులు వాపోతున్నారు. 15, 20 కేజీల బాక్సుల రూపంలో మార్కెట్‌కు తరలిస్తే గతంలో మంచి ధర పలికేది. ప్రస్తుతం పూర్తిగా ధరలు పడిపోవడంతో కోత కోయడానికి కూలి ఖర్చులుకూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సందర్భంలో మార్కెట్‌కు తెచ్చిన కాయలకు ధర లేక రైతులు రోడ్డుపై పారబోసి వెళ్ళిన పరిస్థితులు కూడా ఉన్నాయి. టమోటా మార్కెట్లో 15 కిలోల బాక్స్ గరిష్ట ధరలు వందరూపాయలు దాటడం కష్టంగా మారింది. మరికొన్ని ప్రాంతాలలో మొదటి పంట కోత కు వచ్చేసరికే పూర్తిగా ధర పడిపోవడంతో మూగజీవాలకు పంటను వదిలేసిన పరిస్థితి ఏర్పడింది. ఈ మధ్యకాలంలో రైతులు ఎక్కువ శాతం టమోటా పంటపైనే మొగ్గు చూపుతున్నారు. వీటితో ఇతర ప్రదేశాలకు ఎగుమతులు అవుతూ ఉండేటప్పుడు ధరలు ఒకరకంగా ఉండేవని అయితే చెన్నై, మదనపల్లి, చిత్తూరు, కేరళ ,విజయవాడ, ఇలాంటి పట్టణాలకు ఎగుమతి తగ్గిపోవడంతో పరిసర ప్రాంతాలలో టమోటా ధర పూర్తిగా పడిపోయిందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఏడాది తెగుళ్లతో పంట నష్టపోవడమే కాకుండా అకాల వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం ధర లేక రైతులు నట్టేట మునిగారు.

రూ.90వేలు పెట్టుబడి పెడితే రూ. 40 వేలు వచ్చింది

గత ఏడాది సెప్టెంబర్ మాసంలో టమోటా పంట సాగు చేశా. పంటసాగుకు దాదాపు రూ. 90వేల దాకా ఖర్చుచేశా. డిసెంబర్ మాసంలో మొదటి కోత వచ్చింది. పంట దిగుబడి పూర్తి అయ్యేలోపు కేవలం 40 వేల రూపాయలు మాత్రం వచ్చింది. డిసెంబర్ మాసంలో పూర్తిగా ధర తగ్గిపోవడంతో ఎకరా సాగు చేసిన టమోటా పంటను మూగజీవాలకు వదిలేశా. కూలికి ఖర్చుపెట్టిన డబ్బులు, కుటుంబ సభ్యుల కష్టార్జితం మొత్తం పోయింది.

శ్రీనివాసులు, రైతు
పత్తిగడ్డ గ్రామం.

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి మడకశిర రూరల్

పంటలు నష్టపోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సేంద్రీయ ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించాలని ఎడి కృష్ణమీనన్ సూచించారు. మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో వరి, పప్పు సెనగ పంట పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ పంట నమోదు కార్యక్రమం భాగంగా పంటలు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీర నరేష్, రైతు భరోసా కేంద్రం ఇన్చార్జులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నకళాశాల ప్రిన్సిపల్ ఎన్. హరీష్ బాబు సోమవారం తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణ లైన వారు ఈ కోర్సుకు అర్హులన్నారు. సీటు కావాల్సిన వారు పది, ఇంటర్ మార్కుల లిస్ట్, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ , కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టి.సి), మైనారిటీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు ఒరిజినల్ తో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు. వీటితో పాటు కోర్స్ ఫీజు రూ. 6500 తో ఫార్మశీ విభాగంలో ఫిబ్రవరి 2వ తేదీన సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 9866273402, 9703843680 సంప్రదించాలని ఆయన కోరారు.

దారితప్పుతున్న రోడ్డు నిర్మాణ పనులు

నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని బాధితుల ఆరోపణ

నిర్మాణంలో ఉన్న డ్రయినేజీ, రోడ్డు

ప్రజాశక్తి - పరిగి

అభివృద్ధి పేరుతో చేస్తున్న రహదారి పనులు కొందరికి మాత్రమే అనుకూలించే విధంగా ఉన్నాయని పలువురు బాధితులు ఆరోపించారు. పరిగి మండల కేంద్రంలో వేస్తున్న రహదారి పనుల్లో భాగంగా కొన్ని ప్రదేశాలలో నిరుపేదలు నిర్మించుకున్న ఇళ్లను సైతం పూర్తిగా నేలమట్టం చేసి పలుకుబడి ఉన్న వ్యక్తుల స్థలాలలో ఉన్న నిర్మాణాల్లో అలానే ఉంచుతున్నారని వారు విమర్శించారు. ఎస్ఆర్‌సికాంట్రాక్టర్లు కొందరికి మాత్రంగా అనుకూలంగా పనులు చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. అభివృద్ధి జరుగుతుందంటే చిల్లి గవ్వ కూడా కాంట్రాక్టర్ల నుండి తీసుకోకుండా లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలను తొలగించుకొని కట్టుబట్టలతో బయటకు వచ్చి బాడుగ ఇంట్లో ఉంటున్నామని చెప్పారు. అయితే తమకో న్యాయం మరొకరికి ఒక న్యాయంగా కాంట్రాక్టర్లు వ్యవహరించడం సరికాదన్నారు. కోట్ల రూపాయలతో ప్రభుత్వం డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేస్తుంటే ఈ కాంట్రాక్టర్లు పలుకుబడి ఉన్న కొంతమందితో కొంత మొత్తంలో డబ్బులు తీసుకొని వారికి అనుకూలంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పనితీరు వల్ల బాధితులంతా ఏకమై పనులు నిలిపివేయించి తమకు న్యాయం జరిగే వరకూ రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మండల అధికారులు సైతం తమకేం తెలియదన్నట్టు వ్యవహరించడం సరికాదన్నారు. తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.

నిత్యావసర సరుకులు వాహనాల్లోనే పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలంతో పాటు పట్టణ వ్యాప్తంగా ఉన్న ఎండియూ వాహన ఆపరేటర్లు పౌరసరఫరాల శాఖ తరపున ప్రజలకు అందిస్తున్న నిత్యావసర సరుకులను తప్పని సరిగా వాహనాల ద్వారా అందించాలని ఆదేశించారు. గత కొన్ని నెలలుగా కొంత మంది ఎండియు వాహన ఆపరేటర్లు వాహనాల్లో కాకుండా స్టోర్‌ల వద్దే సరుకులు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో సోమవారం ఎండియులు, స్టోర్ డీలర్ల అసోసియేషన్ నాయకులతో తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి నెల చౌకదుకాణాల ద్వారా రేషన్ కార్డు లబ్దిదారులకు అందించే సరుకులను ప్రభుత్వం నిర్దేశించిన ఎండియూ వాహనాల్లోనే అందించాలన్నారు. లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

సమావేశంలో పాల్గొన్న డీలర్లు, ఎండియు ఆపరేటర్లు

కార్యాలయ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని సున్నంపల్లి గ్రామపంచాయతీ మహమ్మదాబాద్ క్రాస్ గ్రామంలో గ్రామైక్య సంఘం కార్యాలయానికి స్థలం మంజూరు చేయాలని మహిళాసంఘాల సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 34 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు. 356 మంది మహిళలు కలిసి గ్రామ సంఘంగా ఏర్పడి దాదాపుగా 18 సంవత్సరాలుగా లావాదేవీలు కొనసాగిస్తున్నామన్నారు. గ్రామ సంఘం సమావేశాలు ఏర్పాటు చేసుకునేటకు సరైన భవనం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి కార్యాలయం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులు శ్రీదేవి, లింగమ్మ, సత్యవతి, రమణమ్మ, లక్ష్మీదేవి, శాంతమ్మ, తిప్పమ్మ, అంజినమ్మ, సుజాత, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న చైర్‌పర్సన్, తదితరులు

స్టడీ మెటీరియల్ రూపొందించడం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్ రూపొందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో స్టడీ మెటీరియల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో స్టడీ మెటీరియల్ పట్టణంలో లభిస్తాయన్నారు. అయితే ఉర్దు మెటీరియల్ దొరకడం లేదన్నారు. దీనిని గుర్తించిన ఉర్దు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్ సిద్ధం చేసి, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీమన్నారు. ఈ మెటీరియల్ ద్వారా బాగా చదువుకుని, 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జబివుల్లా, మున్సిపల్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు, ఉపాధ్యాయులు ఐనుద్దీన్, హరి, దర్గా ఇమ్రాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో కలెక్టర్ బసంత్ కుమార్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మికులకు యూనిఫామ్, నూనె సబ్బులు అవసరమైన పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట, రొళ్ల, రోద్దం, కోడూరు, పరిగి మండలాల్లో పనిచేసే కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు. సమస్యలకు పరష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పైపల్లి గంగాద్రి, సిఐటియు గౌస్ లాజం, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని కర్నాటక బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ గంగెద్దుల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కాలేజీ సర్కిల్లోని బ్యాంకు కార్యాలయంలో కర్నాటక బ్యాంకు ఐదో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ గంగెద్దుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ బ్యాంకు పరిధిలో అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ప్రసాద్ రెడ్డి, హోండా కిషోర్ కుమార్ రెడ్డి, డాక్టర్ నాగేంద్ర కుమార్ రెడ్డి, జువెలర్స్ దుకాణదారులు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అమరాపురం : మండల పరిధిలోని హేమావతి పంచాయతీ గుణహళ్లి గ్రామంలో దారి విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామంలో దాయాదుల మధ్య వ్యవసాయ భూమిలో దారి విషయంలో గత కొన్నేళ్లుగా వివాదం నెలకొంది. ఈవిషయంపై ఈనెల 7న వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో దొడ్డయ్య అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నాటకకు తరలించారు. ఈ నేపథ్యంలో బాధితులు పోలీసుల తీరుపై సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు ఆరోపించారు. ఈసందర్భంగా ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. స్పందించిన ఎస్ఐ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఫోర్జరీ సంతకాలతో భూమి కాజేశారని ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్ : చెన్నే కొత్తపల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి అనే వ్యక్తి భూమిని ఇద్దరు వ్యక్తులు ఫోర్జరీ సంతకాలు చేసి కాజేశారని బాధితులు ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈవిషయంతో తమకు న్యాయం చేయాలని పోలీసులు ఆశ్రయించినా స్పందించలేదని వాపోయారు.

నకిలీ చిన్నపిల్లల వైద్యుడు అరెస్టు

కొత్తచెరువు : మండల కేంద్రంలో నెహ్రునగర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా చిన్న పిల్లల ఆసుపత్రిని నిర్వహిస్తున్న ఆర్ఎంపి గుర్రం కిరణ్, ఫార్మసిస్ట్ నరసింహమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ ఆవుల మూర్తిని అరెస్టు చేసినట్లు సిఐ జయానాయక్, ఎస్ఐ లింగన్న తెలిపారు. వీరిని సోమవారం మామిళ్ళకుంట క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గతంలో నెహ్రూ నగర్ లో చిన్న పిల్లల ఆసుపత్రిని అనుమతులు లేకుండా నడుపుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు తనిఖీలు చేసి సీజ్ చేశారన్నారు. నిందితులు పరారీలో ఉండడంతో వారిని సోమవారం అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు వివరించారు.

మాజీ సర్పంచి మృతి

గుడిబండ : మండల పరిధిలోని మోరుబాగల్ పంచాయతీ మాజీ సర్పంచ్ రామప్ప అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్, గుడిబండ సర్పంచి కరుణాకర్ మృతుని కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి తిప్పేస్వామి, వైసిపి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

గోరంట్ల : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా 51 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారును వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

కొత్తచెరువు : మండల కేంద్రంలోని కుమ్మర కాలనీ బీసీ కాలనీ వడ్డెర కాలనీ కమ్మ పాలెం ప్రాంతాల వారి కోసం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న కోరారు. ఈ మేరకు ఆయన తహశీల్దార్ రామాంజనేయరెడ్డికి, ఎంపీడీవో సిద్ధారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు విష్ణు, చింతకాయల కిష్టప్ప, వెంకట్రాముడు, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

వాల్టాచట్టాన్ని రద్దు చేయండి

అమరాపురం : మడకశిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వాల్టా చట్టాన్ని రద్దుచేసి రైతులను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ రైతు సంఘం కార్యదర్శి ఉగ్ర నరసింహప్ప సోమవారం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. అయితే అధికారులు వాల్టా చట్టాన్ని రద్దు చేయకపోవటంతో రైతులు వైఎస్ఆర్ జలకళ పథకానికి అర్హులు కాకుండా పోయారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాల్టాచట్టాన్ని రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

టూరిస్ట్ పోలీస్ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గావీరభద్ర పాపానేశ్వర్ ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం టూరిజం పోలీస్ కేంద్రం ఏర్పాటుకు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ స్థల పరిశీలన చేశారు. సోమవారం మండలకేంద్రానికి వచ్చిన ఆయన ఆలయ పరిసరాలలో నంది విగ్రహం వద్ద, జాటాయువు థీమ్ పార్క్, ఆలయం ఉత్తర ద్వారం వద్ద స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, సిఐ వేణుగోపాల్, ఎస్ఐలు మునీర్ అహమ్మద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

తలుపుల : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని సచివాలయం 2 చాకల వీధి, బీసీ కాలనీ, గుడ్డి బాయ్ బజార్, పూల బజార్‌లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా బీసీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, ఎస్ఎండి ఇస్మాయిల్, సర్పంచి శ్రీలత, ఉప సర్పంచి డీకే బాబుతో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

In the Court of the Junior Civil Judge:Puttaparthy
O.S.No.48/2022

Between:
E.Sree Ramulu ...వాది
V/s
S.Reddy & anothers ...ప్రతివాది
...Defendants

Summons to the Defendant No:1&2
To,
1.S.Reddy S/o Late S.Prasad
2.S.Charitha D/o Late S.Prasad
All are residents of old D.No.1-139, Bypass Road at present Residing at 3-50 and 3-51, Hindupuram Main Road, Near Pradhana Chikistha Kendram, Gopuram Street, Kadiri.

పై వాది మీపై దావాలోని నగదు మొత్తమును రాబట్టుకొనుటకు పై దావాను కోర్టులో వేసియున్నారు. పై దావాలో కోర్టువారు మీకు పలుమార్లు దావా సమన్లు మరియు 05 నెం.48/2022 లో పంపిననూ మీరు తీసుకొనక కాలహరణము చేసినారు. కావున పై దావా తేది:10-03-2023న వాయిదా ఉన్నది. కావున మీరు సదరు వాయిదాకు హాజరై మీ అక్షేపణలు తెలుపుకోవచ్చును. లేనంతట దావా పరోక్షముగా తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

చల్లా రాజగోపాల్, బి.ఏ., ఎల్.ఎల్.బి.
న్యాయవాది, పుట్టపర్తి, సెల్:6302132199.